# దొరకని ఆన్సర్!

రచన :
'ఋషిశ్రీ కోరా'

ప్రతిరోజూ రైలు ఎపుడొస్తుందా అని ఎదురు చూస్తుంటారు వాళ్ళు. బండి స్టేషనులో ఆగగానే నేను ఎపుడొస్తానా అని వాళ్ళ కళ్ళు ఆత్రుతతో నా కోసం వెతుకుతూంటాయి. వారి చూపుల్లో ఏదో తెలియని ఆత్మీయత, అనుబంధం గోచరిస్తుంది నాకు.

ఆ రోజు—నేను మొదటిసారి యూనివర్సిటీకి వెళ్ళి వచ్చే రోజున నా కొంగును ఎవరో లాగారు. నేను భయంగా వెనక్కి తిరిగి చూశాను. ఒక చిన్నపిల్ల, సుమారు ఎనిమిదేళ్ళుంటాయి చామనఛాయ, ముడివేసుకొని వున్న జాకెట్టు, అక్కడక్కడ చినిగి అతుకులతో వున్న లంగాను వేసుకొని వున్నది. ఆ పిల్ల ప్రక్కన ఇంకో పిల్ల, అబ్బాయి వున్నారు. వాళ్ళిద్దరూ ఆ పిల్లకంటే చిన్నవాళ్ళు.

ఆ అమ్మాయి "అమ్మగారూ......" అంటూ చేయి చాచింది.

నా కెందుకో జాలి వేసింది. పర్సులో చిల్లరలేదు. వాళ్ళను తోసుకుంటూ రిక్షాను సమీపించాను.

కానీ, వాళ్ళు "అమ్మగారూ అమ్మగారూ" అంటూ కాళ్ళు పట్టుకున్నారు.

నా హృదయం ద్రవించింది.

"గాంధీచౌక్‌కు ఎంతిమ్మంటావ్" అని అడిగాను రిక్షావాడ్ని.

"అరవై పైసలు" అన్నాడు అతను. రూపాయి నోటిచ్చి అరవై పైసలు పోను మిగతా చిల్లర ఇమ్మన్నాను. వాడిచ్చిన వాటిలో తలా పది పైసలు వేశాను.

ఆ పిల్ల కళ్ళు ఎంతో ఆనందంతో మెరిసాయి. కొందరికి లక్షలు వచ్చినా సంతోషం వుండదు. నేను ఇచ్చింది పది పైసలే అయినా వాళ్ళు ఎంతగానో సంతోషపడ్డారు. వాళ్ళు ఎంత అల్పసంతోషులో అని అనుకున్నాను.

ఒకరోజు జయ, నేను వస్తున్నాము. ఆ రోజు పిల్లలు కనపడలేదు. వాళ్ళ కోసం నాలుగు వైపులా చూస్తున్నాను.

ఇంతలో జయ "షటప్ యూస్‌లెస్ ఫెలోస్" అని అన్న కేకకు అటు తిరిగి చూశాను. ఆ పిల్లల మొహంలో కాంతిలేదు. భయంతో వాళ్ళ గుండెలు కొట్టుకొంటున్నాయి. వాళ్ళు నా వైపే దీనంగా చూస్తున్నారు.

నాకు జాలేసింది. వాళ్ళకు తలా పది పైసలు యిచ్చి బయలుదేరాను. దారిలో జయకూ, నాకు మధ్య మాటలేమి జరగలేదు. నేనే పలుకరించాను.

"ఏమిటే జయా, ఇందాక వాళ్ళను అలా కసురుకున్నావు? నేను వేసుకొనే ఓణీ నీవు వేసుకోవటంవల్ల నేననుకొని నీ కొంగు పట్టుకొనుంటారు. అంతమాత్రాన వాళ్ళనలా కసురుకోవాలా? నువ్వన్న మాటలకు ఆ పసి హృదయాలు ఎంత నొచ్చుకుంటాయో?" అని ఒకసారి జయవైపు చూశాను.


నేను చెప్పే మాటలు అది విన్నట్లులేదు. దాని మొహాన చిరునవ్వులు చిందులు వేస్తూంది. నాకు వళ్ళు మండింది.

"వాళ్ళను అంటే నిన్నన్నట్లుగా బాధపడతావేమే! నువ్వు వాళ్ళకిచ్చే పది పైసలుతో వాళ్ళ బ్రతుకులు బాగుపడతా యనుకుంటున్నావా? అలాంటి వాళ్ళు దేశంలో ఎంతోమందున్నారే. వాళ్ళందరినీ నువ్వుద్ధరించగలవా? వాళ్ళను గురించి ఆలోచించి నీ మనస్సు పాడుచేసుకోకు. అది వాళ్ళ ఖర్మ. అంతేగాని నువ్వు రోజుకు రూపాయి ఇచ్చినా వాళ్ళ బ్రతుకులు బాగుపడవు, తెలుసా?

నాకు జయ మాటలు విన బుద్ధిగాలేదు. దానికి ఇంటికి వెళ్ళగానే ఆప్యాయంగా స్వాగతం యిచ్చే తోబుట్టువులున్నారు. కానీ నాకు ఎవ్వరూలేరు. అందుకే నాకు వాళ్ళంటే ఏదో తెలియని ప్రేమ. దాని తమ్ముళ్ళు చెల్లెళ్ళు ఇంటిదగ్గర స్వాగతం పలికితే, నా తమ్ముడు, చెల్లెళ్ళు స్టేషనులోనే స్వాగతం పలుకుతారని అనుకొన్నాను. ఆ మాటలే దానితో అన్నాను.

"గీతా! నువ్వసలు ఈ కాలంలో పుట్టవలసిన దానివి కావే. నువ్వు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో ఇచ్చిన ఆ డబ్బులు ఆ పిల్లలు కొనుక్కుంటారని ఇచ్చావు. కానీ అవి వాళ్ళకు చెందవు. వాళ్ళు తినరే! కాదు, కాదు

ఎల్లప్పుడూ...




26, Stanes Rd., 4th St.,
TIRUPUR - 638602
Regd. No. 300188

" ఎమరాల్డ్ '' బనియన్లనే ఉపయోగించండి.

వాళ్ళను తిననివ్వరు ఆ పసిపాపల దగ్గర డబ్బులు నీ లాంటి కరుణామయులు జాలిపడి ఇచ్చినవి, అవి ఏ సారాయి కొట్టుకో, సానికొంపకో పోతాయే. వాళ్ళకు కనీసం త్రాగటానికి గంజినీళ్ళు కూడా వుండవే'' అని జయ అన్న మాటలు నేను నమ్మలేకపోయాను.

ఎంత కసాయి తండ్రయినా పిల్లలు తెచ్చిన సొమ్మును అలా తగలేస్తాడటవే?

"నీకో నమస్కారం తల్లీ! నేను నీతో వాదించలేను. రేపు ఎగ్జామ్స్ గదా పదకొండు గంటల బండికెళదాం, పది గంటలకల్లా మా ఇంటికిరావే!" అన్నది జయ.

అలాగే నన్నాను.

పరీక్ష వ్రాశాననిపించాను. జయ బాగానే వ్రాసినట్లుంది. కాంటీన్‌కు వెళదామంది.

టీ త్రాగి బయలుదేరేసరికి గార్డ్ విజిల్ ఊదుతున్నాడు. ఎలాగైతేనేమి చివరి పెట్టెను అందుకున్నాము.

స్టేషనులో పిల్లలు కనపడలేదు. నాకు జయను నమిలి మింగేద్దామన్నంతగా కోపం వచ్చింది.

"చూశావటే! నిన్న నువ్వు కసురుకున్నావు కాబట్టి వాళ్ళు ఈ రోజు రాలేదు" అని అన్నాను.

అది మౌనంగా వుంది. స్టేషను నాలుగువైపులా చూశాను. ఎక్కడా కనపడలేదు. రిక్షాకోసం బయటకు వచ్చాము. స్టేషన్ కాంపౌండులో ఒకమూల ఆ ఎనిమిదేండ్ల పిల్లను, ఎవరో సన్నగా పెరిగిన గడ్డంతో, మాసిన బట్టలతో వున్న వ్యక్తి (బహుశ తండ్రి కాబోలు) "ఇవ్వవే ముద్దూ" అంటూ ఆ పిల్లను చావబాదుతున్నాడు. మిగతా ఇద్దరూ డబ్బులిచ్చినట్లున్నారు. ఆ పిల్లను కొడ్తూంటే భయంగా చూస్తున్నారు, ఆ పిల్ల మాత్రం డబ్బులివ్వనన్నట్లు పిడికిలి బిగించింది. కానీ లాభంలేకపోయింది. బలంగా ఒక దెబ్బ కొట్టి డబ్బు లాక్కుపోయాడు.

ఎంతటి కఠినాత్ముడు! నేను తప్ప ఎవ్వరూ వారి విషయం పట్టించుకున్నట్లులేదు. ఛీ, ఛీ! ఏంమనుషులో?

జయవైపు చూశాను. "ఇపుడేమంటావ్" అన్నట్లుంది దాని చూపు.

"నువ్వు చెప్పింది నిజమేనే" అని అన్నాను.

పిచ్చిగీతా! లోకం అంటే అంతే! చూశావా! నువ్వుతప్ప వేరొకరు వారివిషయం పట్టించుకున్నారేమో ఎవరి పనుల్లో వారున్నారు. కన్నతండ్రికి లేని ప్రేమ, ఆప్యాయత, నీ కెందుకే? మారుతున్న లోకంతోపాటు నువ్వూ మారాలే అంతేగాని మారుతున్న మనుష్యుల్ని నువ్వు మార్చలేవే! తల్లిదండ్రులకు లేని జాలి, ఆతృత నీ కెందుకే?

"అవును నా కెందుకు? ఏమో, ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు.



"కథాంజలి ''లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులుకాదు. —సంపాదకుడు.